ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 11 | ఏప్రిల్ | 2024
పేజీలు 8

## అటవీ శాఖ అధికారిపై దాడి





**ప్రజాపక్షం/ములకలపల్లి :** మండల పరిధిలోని గుండాలపాడు పంచాయితీలో గల చలమన్ననగర్ ఎఫ్‌బివో వెంకన్న నాయక్‌పై బుధవారం చలమన్ననగర్ గ్రామానికి చెందిన పోడు సాగుదారులు మూకుమ్మడిగా దాడి చేశారు. దాంతో వెంకన్న నాయక్ తీవ్రంగా గాయపడ్డారు. పోడు సాగుదారుల భూములను ఆనుకొని అటవీశాఖ కొత్తగా చెరువు పనులు మొదలు పెట్టింది. ఈ విషయమై స్థానిక పోడు సాగుదారులకు బీట్ ఆఫీసర్‌కు మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో విధులలో ఉన్న బీట్ అధికారి వెంకన్న నాయక్‌పై సుమారు 15 మంది కర్రలతో దాడి చేసినట్లు అటవీ శాఖ ఉద్యోగులు తెలుపుతున్నారు. ఈ దాడిలో వెంకన్న నాయక్ శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. అటవీ సిబ్బంది హుటాహుటిన వెంకన్న నాయక్‌ను పాల్వంచలోని ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన వారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో అటవీ శాఖ అధికారులు ఫిర్యాదు చేసింది.

# స్థానికులా.. స్థానికేతరులా..!

ప్రధాన పోటీదారులుగా రాయల, మండవ

## తేల్చుకోలేని కాంగ్రెస్

వంకాయలపాటి రాజాకు అవకాశం...?







**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఓ నిర్ణయానికి రాలేకపోతుంది. అయితే మంత్రుల కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించరాదని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మంత్రుల కుటుంబ సభ్యులను కాదన్న తర్వాత ఇప్పుడు స్థానికులకు ఇవ్వాలా స్థానికేతరులకు ఇవ్వాలా అన్న విషయంలో కాంగ్రెస్ తేల్చుకోలేకపోతుంది. సామాజిక వర్గ పరంగా ఆలోచించినప్పటికీ స్థానికులు బలమైన అభ్యర్థులుగా ఉండడంతో తుది నిర్ణయం తీసుకోవడానికి కాలయాపన చేస్తున్నది. ఇప్పటికే బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తుండగా కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించక పోవడంతో కొంత స్తబ్దత ఏర్పడింది. ఈనెల 12 లేదా 13 తేదీలలో కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందన్న ప్రచార నేపథ్యంలో స్థానికులకు అవకాశం కల్పిస్తారా లేదా స్థానికేతరులకు అవకాశం ఇస్తారా అన్న చర్చ సాగుతుంది. 1952లో ఏర్పడిన ఖమ్మం నియోజక వర్గం నుంచి స్థానికేతరులైనా లక్ష్మికాంతమ్మ, పివి రంగయ్య నాయుడు, నాదెళ్ల భాస్కర్‌రావు, రేణుకాచౌదరి కాంగ్రెస్ ఎంపిలుగా ఎన్నికయ్యారు. ఖమ్మం ఎంపి స్థానానికి ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరగగా రెండు సార్లు సిపిఐ, ఒక సారి సిపిఎం, 11 సార్లు కాంగ్రెస్, ఒక్కోసారి వైసిపి,

మిగతా 2లో..

## ఇండస్ ఇండ్ ఖాతాల్లో డబ్బు మాయం

-బ్యాంకు మేనేజరే సూత్రధారి
-పెరుగుతున్న బాధితులు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖాతాదారుల సొమ్ము తమ వారి ఖాతాలకు మళ్లించి అడ్డంగా దొరికిపోయాడు బ్యాంకు మేనేజర్. విదేశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు రుణాలు మంజూరు చేసి ఫీజులు కిస్తీల వారీగా చెల్లించేందుకు డబ్బును ఖాతాల్లో ఉంచారు. ఆ సొమ్మును ఖాతాదారులకు తెలియకుండా తమ వారి ఖాతాల్లోకి బ్యాంకు మేనేజర్ మళ్లించారు. బాధితులలో కొందరు బ్యాంకు సిబ్బంది ఉండడం గమనార్హం. ఖమ్మం నగరంలోని వైరా రోడ్డు జెడ్పి సెంటర్ సమీపంలో గల ఇండస్ ఇండ్ నేషనల్ బ్యాంకు ద్వారా విదేశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు రుణాలు మంజూరు చేస్తున్నారు. రుణాలు మంజూరైన తర్వాత విదేశాల్లోని విద్యా సంస్థలకు కిస్తీల వారీగా చెల్లించేందుకు విద్యార్థుల ఖాతాల్లోనే కొంత డబ్బును ఉంచారు. తల్లిదండ్రులు లేదా విద్యా సంస్థల నుంచి సమాచారం రాగానే కిస్తీ ఆ విద్యా సంస్థల ఖాతాలకు బదిలీ చేస్తారు. ప్రస్తుత మేనేజర్ విద్యార్థుల ఖాతాల్లో ఉన్న సొమ్మును విదేశీ విద్యా సంస్థలకు కాకుండా తమ వారి ఖాతాల్లోకి మళ్లించాడు. తమ ఖాతాల్లో డబ్బులు లేని విద్యార్థులు ఆరా తీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతానికి 25 మంది ఖాతాదారుల నుంచి నగదును ఇతరుల ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు సమాచారం. బాధితులు మరింత పెరిగే అవకాశం ఉంది. పూర్తి విచారణ తర్వాత కానీ ఎంత మంది ఖాతాల్లో డబ్బులు కాజేశారు, ఎంత మొత్తం కాజేశారు అన్న విషయం నిర్ధారణ కానుంది. దీనికి సంబంధించి ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బ్యాంక్ మేనేజర్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదైంది. ఆరోపణలు వచ్చిన వెంటనే బ్యాంకు మేనేజర్‌ను బ్యాంకు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా నాలుగు రోజుల క్రితమే బ్యాంకు మేనేజర్ దివాళా పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం.

## రజబ్ అలీ చిరస్మరణీయుడు



2 లో

-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
-అమరుల ఆశయసాధనకు కృషిచేద్దాం
-సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా రజబ్ అలీ వర్ధంతి

## చిరస్మరణీయుడు మహ్మద్ రజబ్ అలీ

-వర్ధంతి సభలో బాగం
-రజబ్ అలీకి ఘన నివాళి

3 లో



# స్థానికులా.. స్థానికేతరులా..!

(మొదటిపేజీ తరువాయి)

బిఆర్ఎస్, టిడిపిలు విజయం సాధించాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా ఖరారు చేసుకుంటే చాలు గెలుపు ఖాయమన్న పరిస్థితుల్లో ఖమ్మం స్థానానికి తీవ్రమైన పోటీ ఏర్పడింది. తొలుత జిల్లాకు చెందిన మంత్రుల కుటుంబ సభ్యులు తీవ్రమైన ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ అధిష్టానం ఇటీవల జరిగిన తుక్కుగూడ బహిరంగ సభ తర్వాత మంత్రుల కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించరాదన్న నిర్ణయం తర్వాత అనూహ్యంగా మండవ వెంకటేశ్వరరావు పేరు తెరపైకి వచ్చింది. మండవ వెంకటేశ్వరరావు తుమ్మల నాగేశ్వరరావుకు అత్యంత సన్నిహితుడనే పేరు ఉంది. తెలుగుదేశం పాలనా కాలంలో మండవ అత్యంత కీలక నేతగా వ్యవహరించారు. వివాదరహితుడిగా మండవకు పేరుంది. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో 17 స్థానాల్లో ఎక్కడ కమ్మ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్లమెంటు సీటు కేటాయించకపోవడంతో ఖమ్మం స్థానం నుంచి అవకాశం కల్పిస్తారన్న చర్చ సాగుతుంది. మంత్రుల కుటుంబ సభ్యుల పేర్లు పరిగణలో లేకపోవడంతో ఇప్పుడు స్థానిక కాంగ్రెస్ నాయకుడు రాయల నాగేశ్వరరావు పేరు వినపడుతుంది. ఉన్నత విద్యావంతుడైన రాయల నాగేశ్వరరావు ఇటీవల జరిగిన శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన పోటీ చేశారు. అందరితో కలివిడిగా ఉండే రాయల నాగేశ్వరరావు గతంలో పాలేరు టికెట్ ఆశించి గడిచిన ఐదేండ్లుగా ఆ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ పక్షాన కార్యక్రమాలు నిర్వహించారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో తప్పని స్థితిలో కాంగ్రెస్ పార్టీ టికెట్ పొంగులేటికి కేటాయించారు. ఇటీవల గిడ్డంగుల సంస్థ కార్పోరేషన్ ఛైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు నియమించారు. మంత్రుల కుటుంబ సభ్యులు పోటీలో లేకపోవడం రాయల నాగేశ్వరరావు సైతం కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రేణుకాచౌదరితో సన్నిహితంగా మెలగడంతో రాయల నాగేశ్వరరావుకు దక్క వచ్చునని భావిస్తున్నారు. ఆది నుంచి కాంగ్రెస్ కుటుంబానికి చెందిన పారిశ్రామికవేత్త వంకాయలపాటి రాజా పేరు సైతం వినపడుతుంది. ఆయన ఢిల్లీలో ఉండి అధిష్టానంతో సంప్రదింపులు జరుపుతూ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ ముగ్గురిలో ఎవరికో ఒకరికి అవకాశం దక్కవచ్చునని తెలుస్తుంది. మొత్తంగా నామినేషన్లకు మరో వారం రోజులు గడువు ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించక పోవడం చర్చనీయాశంమైంది.

## ఎన్నికల సహాయక కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన లోక్‌సభ ఎన్నికలు 2024 సహాయక కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రజలకు ఓటరు సంబంధ సమస్యలు, సందేహాలకు, జాబితాలో పేరు ఉన్నది లేనిది, ఏ పోలింగ్ స్టేషన్‌లో ఓటు ఉన్నది తెలుసుకోవడానికి సూచనలు, సహాయం చేస్తారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయు అభ్యర్థులకు బ్లాంక్ నామినేషన్ పత్రాలు ఇవ్వడం, నామినేషన్ పత్రాల పూరింపులో సలహాలు, సందేహాల నివృత్తి చేయడం, ఓటరు జాబితాలో అభ్యర్థి పేరు, అభ్యర్థుల ప్రపోజర్ల పేర్లు ఉన్నవి లేనివి చూడడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం నుండి వచ్చిన నామినేషన్ పత్రాలు ఇవ్వడం జరుగుతుందని, ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేయడం లాంటివి చేయకూడదన్నారు. నామినేషన్ పత్రాల్లో తేడాలు ఉంటే సమస్యలు వస్తాయన్నారు. కావున ఇట్టి సహాయక కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజు, జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, మాస్టర్ ట్రైనర్లు కె. శ్రీరాం, మదన్‌గోపాల్, కలెక్టరేట్ ఏవో అరుణ, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్లు రాంబాబు, సత్యానారాయణ, వి. వెంకన్న, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్బైడ్ రహిత మామిడి మేళా ప్రారంభం






ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలో కార్బైడ్ రహిత మామిడి పండ్ల మేళా ప్రారంభమైంది. కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన ఆదర్శ రైతు బానోత్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం నగరంలోని పెవిలియన్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్బైడ్ రహిత మామిడి పండ్ల మేళాను పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రారంభించారు. కార్బైడ్ రహిత మామిడి పండ్లను తిని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రామయ్య సూచించారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతు లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ 2013లో ఉన్న కలెక్టర్ సిద్దార్థ్ జైన్ , మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి హయాంలో మామిడి మేళాను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఆ నాటి నుండి నేటి వరకు ప్రజల ఆదరణతో 12 ఏళ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఎలాం టి రసాయనిక పదార్థాలు వాడకుండా ట్రైలలో, రైఫినింగ్ చాంబర్ ద్వారా ఈ మామిడి పండ్లను పండించి విక్రయిస్తున్నట్లు తెలిపారు. మా దగ్గర చిన్న రసం మామిడి పండ్లు, బంగినపల్లి, చెరకు రసం, దశేరి, హిమాయ్, పెద్ద రసం, సువర్ణరేఖ, ఆల్ఫన్ సో, మల్లిక వంటి రకాల మామిడి పండ్లు, పచ్చడి మామిడి కాయలు తెల్ల గులాబీ, జలాలు, నీలం వంటి మరెన్నో నాటు రకాల మామిడి పండ్లు లభిస్తాయని ఆయన తెలిపారు. అతి తక్కువ ధరలకే వినియోగదారుల సంతృప్తి, వారి అభిరుచి మేరకు అన్ని రకాల మామిడి పండ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. 10 కేజీలు కొన్న వారికి ఒక కేజీ ఉచితమన్నారు. సుమారుగా 45 రోజులు అందుబాటులో ఉంటామన్నారు. ఈ ఏడాది కాపు తక్కువగా ఉన్నందున ప్రజలు త్వరితగతిన మధురమైన మామిడి పండ్లను కొనుగోలు చేయాలని రైతు బానోత్ లక్ష్మణ్ మామిడి ప్రియులను కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెం. 9908848371 నెంబరును సంప్రదించాలని ఆయన తెలిపారు.

## అందరిచూపు.. కల్పవృక్ష నర్సింహుని వైపే..



ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాద్రి దివ్యక్షేత్రంలో వెలిసిన కల్పవృక్ష నర్సిహుని పూజించి తరిలేంచుదుకు అందరి చూపు ఇటు మళ్లుతోంది. ఇక్కడి స్వామికి ముడుపులు కడితే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. భద్రాద్రి రాముని దర్శనార్థం వచ్చే భక్తులు సైతం కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్ష నారసింహ స్వామి వారిని దర్శించుని తరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు డా. కృష్ణ చైతన్య స్వామి మాట్లాడుతూ ఇక్కడ కొలువై ఉన్న దేవుడు సాక్షాత్తూ లక్ష్మీనర్సింహస్వామివారి వరప్రసాదం అని, అందుకే ప్రతినిత్యం వందలాది మంది భక్తులు ముడుపులు కట్టి స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారని అన్నారు. ఉభయ రాష్ట్రాల నుండే కాక దేశ నలు మూలల నుండి భక్తులు తరలిరావడంతో ప్రాంగణంలో భక్తులతో నిండిపోయింది. సామాన్యులతో పాటు విఐపిలు సైతం క్యూ కడుతూ పూజలు చేస్తున్నారుని చెప్పారు. ఎన్నో మహిమలు చూపుతున్న స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ప్రతినిత్యం అన్న ప్రసాదాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

## రజబ్ అలీ చిరస్మరణీయుడు




ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి: రాష్ట్ర రాజకీయాల్లో తనకుంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పచుకున్న గొప్ప నాయకుడు, నిగర్వి రజబ్ అలీ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నాటి సిపిఐ నాయకులు మాజీ ఎమ్మెల్యే రజబ్ అలీ వర్ధంతి సందర్భంగా బుధవారం కొత్తగూడెంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం ఈ కార్యక్రమంలో సాంబశివరావు మాట్లాడుతూ ... ఉన్నత కుటుంబంలో జన్మించి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై ఆస్తిపాస్తులను వదిలి నిత్యం ప్రజాసేవలో ఉన్న గొప్ప నాయకుడు అన్నారు. ఆయన రాజకీయ జీవితంలో ఆరుసార్లు శాసనసభ ఎన్నికల్లో గెలిచిన గొప్ప రాజకీయ నాయకుడు అనునిత్యం పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడిన మహోన్నత నాయకుడు అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన రాజకీయ జీవితం నేటి తరం నాయకులకు ఆదర్శవంతం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి గెద్దాడ నగేష్, భాష, గుత్తుల శ్రీను, హరీష్, కరుణాకర్, రమేష్,కన్నయ్య, నారాయణ, గోపి, రాము, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సిపి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఈద్గా ప్రార్థన ప్రాంతాల్లో పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాట్లను చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఈద్గా ప్రాంతాల్లో ముస్లిం సోదరులు సామూహికంగా నిర్వహించే ప్రార్థనలు దృష్టిలో ఉంచుకుని బుధవారం నగరంలోని గొల్లగూడెం ఈద్గా ప్రాంతాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. ట్రాఫిక్, పార్కింగ్, భద్రతపై నిర్వహకులతో పాటు అధికారులతో చర్చించారు. ప్రత్యేక ప్రార్థన కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. పండుగ సందర్భంగా పార్కింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, టౌన్ ఏరియా ఏసిపి రమణమూర్తి, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పార్కులను సందర్శించిన మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని పలు పార్కులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. బుధవారం నగరంలోని వెలుగుమట్ల వద్ద గల అటవీ పార్కును, లకారం ట్యాంక్ బండ్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. సాయంత్రం సమయంలో సరదాగా పార్కులో గడిపారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగర ప్రజలకు ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణాన్ని కల్పించేందుకు తాను మంత్రిగా ఉన్న సమయంలో లకారం ట్యాంకు బండ్‌ను, వెలుగుమట్ల అటవీ పార్కును అభివృద్ధి చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, సాధు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, మలీదు జగన్, మిక్కిలినేని నరేంద్ర, ఆళ్ల అంజిరెడ్డి, కొప్పెర ఉపేందర్, కమతం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భద్రమ్మకు పలువురి నివాళి



ప్రజాపక్షం/ కామేపల్లి : సిపిఐ సభ్యురాలు పుచ్చకాయల భద్రమ్మ సంస్మరణ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌తో పాటు నివాళులర్పించారు. మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన భద్రమ్మ సుదీర్ఘకాలం కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా ఉన్నారు. ఆమె సంస్మరణ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు యర్రా బాబు, తాటి వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు బండి సత్యం, పుచ్చకాయల వెంకటేశ్వరరావు, పుచ్చకాయల కృష్ణ తదితరులు ఉన్నారు.

# చిరస్మరణీయుడు మహ్మద్ రజబ్ అలీ





**-వర్ధంతి సభలో బాగం**
**-రజబ్ అలీకి ఘన నివాళి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సుదీర్ఘ కాలం శాసన సభ్యునిగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన మహ్మద్ రజాబ్ అలీ చిరస్మరణీయుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధునిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా రజబ్ అలీ ప్రజల హృదిలో నిలిచిపోయారని ఆయన తెలిపారు. మహ్మద్ రజబ్ అలీ 28వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో బుధవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన రజబ్ అలీ తొలి నాళ్లలో ఉర్దూ తెలుగు అనువాదకునిగా పనిచేశారన్నారు. తెలంగాణలో నాటి ప్రత్యేక పరిస్థితులను చూసి కమ్యూనిస్టు పార్టీలో చేరారన్నారు. ఖమ్మంజిల్లాలో జరిగిన ఆంధ్ర మహాసభ రైతాంగ ఉద్యమంలో, బండి పట్టాల ఉద్యమంలోను చురుకుగా పాల్గొన్నారని హేమంతరావు తెలిపారు. సాయుధ తెలంగాణ పోరాట కాలంలో మూడున్నర ఏళ్ల పాటు రజబ్ అలీ జైలు జీవితం గడిపారన్నారు. ఖమ్మం నియోజక వర్గం నుండి రెండు సార్లు, సుజాతనగర్ నియోజక వర్గం నుంచి నాలుగు సార్లు శాసన సభకు ఎన్నికయ్యారన్నారు. చట్టసభలలో పేదల వాణి వినిపించి ప్రజల మనిషిగా పేరొందరన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పలు ప్రజా ఉద్యమాలకు రజబ్ అలీ నాయకత్వం వహించారని గణేశ్వరం, వినోభానగర్ తదితర చోట్ల చారిత్రిక భూ పోరాటాలకు నాయకత్వం వహించి వందలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశారన్నారు. ముఖ్యంగా గిరిజన సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదని గిరిజనులు ఆయనను ముద్దుగా లంబాడోళ్ల రాందాస్‌గా పిలుచుకునే వారని హేమంతరావు గుర్తు చేశారు. పాలకుల, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడటమే రజబ్ అలీకి మనమిచ్చే సరైన నివాళి అన్నారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు గాదె లక్ష్మి నారాయణ, ఇటికాల రామకృష్ణ, యానాలి సాంబశివారెడ్డి, ఏనుగు గాంధీ, బోడా వీరన్న, ఎస్‌కె సైదా, నాయకులు మేకల రవి, జ్వాలా నర్సింహారావు, ఎస్‌కె చానా తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

**పల్లె దవాఖానాను తనిఖీ చేసిన కలెక్టర్**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పల్లె దవాఖానాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ విపి గౌతమ్ రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామంలోని పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షుగర్, బిపి వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల మందులు ఇవ్వాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు ఎంత మంది పిల్లలకు ఇచ్చింది, ఇంకా ఎంత మంది పిల్లలకు ఇవ్వాల్సింది అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిరోధక టీకాలు ప్రతి పిల్లవానికి అందించాలన్నారు. పాము, కుక్కకాటు లకు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈడిడి చార్ట్‌లను ప్రదర్శించాలన్నారు.గర్భిణీలకు అవసరమైన పరీక్షలు సమయానుసారం చేయాలన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని తెలిపారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఎండ వేడిమి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలకు వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. మాలతి, వైద్యులు బాలకృష్ణ, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడలో పర్యటించిన మట్టా దయానంద్



**ప్రజాపక్షం/ తల్లాడ :** కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ బుధవారం తల్లాడలో పర్యటించారు. తల్లాడకు చెందిన తన మిత్రుడు యాచవరపు సురేందర్‌రెడ్డి తల్లి సుశీలమ్మ దశదిన కర్మ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. అదేవిధంగా నారాయణపురంకు చెందిన కర్లకంటి దివ్య ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాపా సుధాకర్, ఎంపిటిసి దగ్గుల రఘుపతిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, నాయకులు రాయల బాబు, వడ్డే రామారావు, మాజీ ఎంపిటిసి తాళ్ల జోసెఫ్, పడగాల లచ్చిరెడ్డి, బొడ్డు వెంకటేశ్వరరావు, నాగన్న, కటిక కిరణ్‌కుమార్, పొట్టేటి జనార్ధన్‌రెడ్డి, లక్కాృరెడ్డి, పైడిపల్లి రవి, అనుమల కృష్ణ, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

## వడదెబ్బ ప్రమాదకరం

**-పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ విపి గౌతమ్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వడదెబ్బ ప్రమాదకరమని జాగ్రత్తలతోనే నివారణ సాధ్యమని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వడదెబ్బ నుంచి రక్షించుకుందాం అనే ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ విపి గౌతమ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఎండ వేడిమి నుంచి రక్షణ పొందాలన్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టణాలు, గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అధికారులను, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, శిక్షణ కలెక్టర్ యువరాజ్, డిఎఫ్‌వో సిద్దార్ధ్ విక్రమ్ సింగ్, అదనపు డిసిపి ప్రసాదరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మాలతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణిలో రంజాన్ వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రంజాన్ సందర్భంగా త్రివేణి పాఠశాలలో ఇఫ్తార్ విందు, రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ శాంతి, సహనం ఇస్లాం మూల సూత్రాలని వాటిని పాటించి సమాజంలో శాంతిని నెలకొల్పాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో అన్ని పండుగలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మత సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందన్నారు. ముస్లిం విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొని ఇఫ్తార్ విందు, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సిఆర్‌వో కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల వద్ద పడిగాపులు...!

**-మస్టర్ ఫోటో తీసుకునే వారు లేక కూలీల అవస్థలు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని మంగాపురంతండా పంచాయతీలో ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు ఇబ్బందులు తప్పటం లేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సహాయకుడు లేకపోవటంతో స్థానిక సీనియర్ మేట్ కు బాధ్యతలు అప్పగించారు. బుధవారం ఆయన కూడ పని వద్ద కు రాకపోవటంతో ఆయన కోసం దాదాపు రెండు గంటల పాటు కూలీలు పడిగాపులు కాశారు. చివరకు పంచాయతీ గుమస్తా పని వద్ధ కు వెళ్లి మస్టర్ ఫోటోలను తీశారు. మొత్తం 146 మంది కూలీలు పని వద్దకు వెళ్లి నానా అవస్తలు పడ్డారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవటంతో సీనియర్ మేట్ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆయన పని కి రాని రోజు పరిస్థితి దారుణంగా ఉంటుంది. గ్రామంలో ఏళ్ల తరబడి క్షేత్ర సహాయకుడు లేకపోయిన అధికార యంత్రాంగం పట్టించుకోవటం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## పవిత్ర మాసం రంజాన్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పవిత్ర మాసం రంజాన్ పండుగ అని రాజేశ్వరపురం తాజా మాజీ సర్పంచ్ దండా పుల్లయ్య అన్నారు. మండలం లోని రాజేశ్వరపురం లో దండా సీతమ్మగోపయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆయన కుమారుడు దండా పుల్లయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...నెల రోజుల పాటు ఎంతో నిష్టతో ఉపవాసాలు ఉండి ఆకలిదప్పులు ,విలువ తెలుసుకుని పవిత్రంగా జరుపుకునేది రంజాన్ పండుగ అన్నారు. సహానం , త్యాగం, జాలీ, దయ , సేవా గుణాలను అలవర్చుకోవాలని సూచించారు.మహమ్మద్ ప్రవక్త ఆదేశానుసారం ఫిత్రా పేరిట పేదలకు ఆహారం, వస్త్రాలు, నగదు రూపంఓ పేదలకు సహాయం చేస్తున్న సంప్రాదాయం ఎంతో గోప్పదని అన్నారు.ప్రతీ ఒక్కరూ రంజాన్ ను సంబరంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్ధలు షేక్ సొందుమియా,దస్గగిరి, సిద్ధయ్య, గఫార్, అఫ్జల్, గ్రామ పెద్ధలు దండా నరసింహారావు, యలమద్ధి లెనిన్, దండా నవీన్, వీరవెల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సవాల నడుమ రంజాన్ పండుగ జరుపుకోవాలి

### -ముస్లింలకు తోఫా కిట్లు పంపిణీ చేసిన గడల భాస్కర్‌రావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్లలో ముస్లింలకు రంజాన్ పండుగను పురస్కరించుకొని సేమియా , పంచదార , కిస్‌మిస్ , జీడిపప్పు తదితర వస్తువుల కిట్టును గడల సీతారామయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు గడల భాస్కర్ రావు బుధవారం అందించారు. ఈ కిట్టును తనికెళ్ల భారత కమ్యూనిస్టుపార్టీ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగను ఆనందోత్సవాల మధ్య సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. తనికెళ్లలో కులమతాలకు అతీతంగా హిందూ , ముస్లిం పండుగలను అందరు కలిసిమెలిసి జరుపుకునే ఆనవాయితీ ఉందని అన్నారు. హిందూ ముస్లిం భాయి భాయి అనే కలిసిమెలిసి జరుపుకుంటారని తెలిపారు. మత సామరస్యాన్ని చాటి చెప్పేందుకే తను ఈకార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ముస్లింసోదరీ , సోదరులు కూడా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ల సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు , జిల్లా నాయకులు పివిరావు , ఎస్టీయు నాయకులు లేడిబోయిన గోపాల్‌రావు, యూటిఎఫ్ నాయకులు షేక్ రంజాన్ , గడల శ్రీనివాసరావు , పిన్నం పుల్లయ్య, ఆకుతోట శంకర్‌రావు , బాసా నాగరాజు , మేకల మల్లిఖార్జున్‌రావు , గుమ్మిడెల్లి సైదారావు , షేక్ చిన్నజాని , పసుమర్తి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలి

### - మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ దయాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** తెలుగువారి నూతన సంవత్సరాది శ్రీక్రోధి నామ సంవత్సరం(ఉగాది) ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలని మన స్ఫూర్తిగో కోరుకుంటున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని సాయిప్రభాత్‌నగర్,టెంపుల్‌సిటీ,ఆర్‌ఎస్‌నగర్‌లలో ఆయా కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రావణం నిర్వహించారు. ఇందులో భాగంగా వేదపండితులు పంచాంగ పఠనం చేశారు. అనంతరం దయాకర్‌రెడ్డి,టిపిసిసి రాష్ట్ర ప్రచార కన్వీనర్ ధరావత్ రామ్మూర్తిని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మద్ది కిషోర్ రెడ్డి, అజ్మీర అశోక్‌నాయక్, వెంకటేష్‌యాదవ్, బానోత్ కిషోర్, బానోత్ దివ్య, బానోత్ ప్రసాద్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కార్యకర్తను పరామర్శించి దయాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని మంగళగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బొల్లేపోగు హరీష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఖమ్మంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆస్పత్రి దగ్గరకు వెల్లి ఆరోగ్య పరిస్థితని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని అన్ని రకాలుగా అండగా ఉంటానని కార్యకర్త,కుటుంబ సభ్యులకు భరోసాను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండల రెవిన్యూ కార్యాలయంలో రాజకీయపార్టీలతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సంబధిత అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా ఓటర్ నమోదు, జాబితలో మార్పులు, చేర్పులు, తదితర అంశాలపై ఆయా పార్టీల ప్రతనిధులతో చర్చించారు. అదేవిధంగా హెల్ప్‌డెస్క్‌ను గురించిన పూర్తి సమాచారాన్ని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో పాలేరు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ పి.రాజేశ్వరి, తహశీల్దార్ బి.రాంప్రసాద్, ఎన్నికల డీటీ రవీందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలి

### - సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ప్రజల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సమాజస్పృహ కలిగిన ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పొన్నెకంటి పెద్ద వెంకన్న జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు పొన్నెకంటి చక్రవర్తి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తొలుత దీనిని దండి సురేష్, సిపిఐ శ్రేణులతో కలిసి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నిప్పుల కొలమిని తలపిస్తున్న వేసవితో భూగర్భ జలాలు ఇంకిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో బావులు,బోర్లు,చెరువులు ఎండిపోవడంతో నీళ్ల కోసం ఇక్కట్లు మొదలయ్యాయి అన్నారు. కావున గ్రామాల్లో, రహదారుల వెంట చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా దాహార్తిని తీర్చవచ్చు అన్నారు. అనంతరం చలివేంద్రం ఏర్పాటు చేసిన చక్రవర్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వరంగల్‌క్రాస్‌రోడ్డు గ్రామశాఖ కార్యదర్శి వెంపటి సురేందర్, సిపిఐ నాయకులు ఏర్పుల బ్రహ్మం, మేళ్లచెర్వు గురవయ్య, ఆరెంపుల సతీష్, శ్రీను, ఉపేందర్, యువజన సంఘం నాయకులు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి రమేష్, గణపరపు ఉపేందర్, మేళ్లచెర్వు సాయి, శ్రీకాంత్, వెంకన్న, వల్లెబోయిన వినోద్, పొన్నెకంటి అఖిల్, మామిడాల కిరణ్, ఎల్లయ్య, మహేష్, గరికబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

### - ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకులు బందెల వెంకయ్య




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని పకడ్బంధీగా అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలంలోని కాశిరాజుగూడెం గ్రామంలో ఉపాధికూలీల సమస్యలపై సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్,ప్రజాపంథా అనుబంధ అఖిలభారత ప్రగతిశీల వ్యవసాకార్మిక సంఘం ఆధ్వర్యంలో జనరల్‌బాడి సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ...ఉపాధిహామీ చట్టంలో చాలా లోపాలు ఉన్నాయని వాటిని సవరించి కూలీలకు 200రోజుల పని దినాలు కల్పించాలన్నారు. రూ.600వందల వేతనం చెల్లించాలని,పనిచేసే ప్రదేశంలో వేసవికాలంలో టెంట్లు వేసి ఎండదెబ్బ తగలకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అంతేకాకుండా మెడికల్‌కిట్లు,మజ్జిగ, ఓఆర్‌ఎస్‌ప్యాకెట్లు, రవాణా చార్జీలు,ప్రమాద బీమా ఇన్సూరేన్స్, ఉపాధిహామీ చట్టంలో నిధులు పెంచాలని అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వ వైద్యం చేయించి మస్టర్ వేయాడంతో పాటు వడదెబ్బకి మరణించిన వారి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) ఖమ్మం జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, పాలేరుడివిజన్ అధ్యక్షులు సోమనపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు వెంకటఅప్పారావు, మట్టపల్లి వెంకటేశ్వర్లు, మహంకాళి వెంకన్న, మండల గురవయ్య, సత్యఅరుణ, ఏలూరు వీరయ్య, మండల భాగ్యమ్మ, మండల సైదమ్మ, అయితే నబోయిన కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఓటు హక్కుపై అవగాహన



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలం పరిధిలోని మహాదేవపురం, ఇల్లూరు గ్రామాల్లో బుధవారం ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం కింద ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు మధిర తహశీల్దార్ వెంకటేశ్వర్లు ఓటు హక్కు ప్రాధాన్యత, వినియోగంపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో, దేశవ్యాప్తంగా జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రలోభాలకు గురి చేయడం, ఓటర్కు నగదు పంపిణీ తదితర విషయాలపై సివిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయటం ఎలాగో వివరించారు. వృద్ధులు, వికలాంగులకు సంబంధించిన ప్రత్యేకంగా ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని తొర్లపాడు గ్రామంలో గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయటం జరిగింది. మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్ర రంజాన్ పండుగను ముస్లింసోదరులందరూ ఆనందంగా జరుపుకోవాలని, ముందుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్, సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, బిసిసెల్ మండల అధ్యక్షులు చిలువేరు బుచ్చి రామయ్య, గ్రామశాఖ అధ్యక్షులు చేబ్రోలు కృష్ణ, నరెడ్ల వెంకటరెడ్డి, కాసిబోయిన శ్రీనివాసరావు, షేక్.ఖన్నాసాహెబ్, షేక్.ఉద్దండుసాహెబ్, కోట డేవిడ్, మాగం ప్రసాద్, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బిషప్ సగిలి ప్రకాష్ అభిషేక మహోత్సవం

### -హాజరైన వివిధ రాష్ట్రాల పీఠాధిపతులు, మత గురువులు
### -గుర్రపు బండిపై కన్నులపండుగగా సాగిన శోభయాత్ర
### -వేలాదిగా వచ్చి వేడుకలను తిలకించిన విశ్వాసులు










**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని నాయుడుపేటలో గల కరుణగిరి పుణ్యక్షేత్రంలో ఆర్‌సీఎం ఖమ్మం పీఠం బిషప్‌గా సగిలి ప్రకాష్ అభిషేక మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఇన్చార్జి బిషప్ డాక్టర్ ఉడుముల బాల సభా పర్యవేక్షణలో విశ్వాసులు సందోహం మధ్య వివిధ రాష్ట్రాల పీఠాధిపలు, మత గురువులతో నిర్వహించారు. ఆర్‌సీఎం విశ్వ గురువు పోపు ఫ్రాన్సిస్, కడప పీఠానికి చెందిన గురువు సగిలి ప్రకాష్‌ని ఖమ్మం నూతన పీఠాధిపతిగా నియమించారు. ఇందుకు సంబంధించిన ప్రమాణ పత్రాన్ని భారతదేశ పోపు ప్రతనిధి, సెక్రటరీ కేవియన్ జాయింట్ జస్టిస్ లాటిన్ భాషలో నూతన భిషప్‌కు అందించారు. అభిషేక మహోత్సవాన్ని హైదరాబాద్ అగ్ర పీఠాధిపతి కార్డినల్ ఆర్చ్ బిషప్ పూల అంథోని సహ అభిషేక పీఠాధిపతులు, కడప పీఠ పాలనాధికారి బిషప్ గాలి బాలి, వరంగల్ పీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాలచే శ్రీ సభ నియమాలతో సంప్రదాయ సిద్దంగా నిర్వహించారు. అనంతరం బిషప్ సగిలి ప్రకాష్‌ను గజమాల,శాలువాలతో మత గురువులు ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలలో హైదరాబాద్, కడప, వరంగల్, తిరుపతి, చిత్తూరు, విజయవాడ, గుంటూరు. తమిళనాడు, ఖమ్మం జిల్లా భద్రాద్రికొత్తగూడెం జిల్లాలతో పాటు తదితర ప్రాంతాలకు చెందిన గురువులు, బ్రదర్స్,సిస్టర్స్, కన్యస్త్రీలతో పాటు దాదాపు 15వేల మందికి పైగా భక్తులు హాజరయ్యారు. తొలుత కొత్త బస్టాండ్ నుంచి ద్విచక్ర వాహనాలు,మేళతాళాలలు,కోలాటం, డప్పు నృత్యాలతో సభాస్థలి కేథడ్రాల్ చర్చ్ వరకు కన్నులపండుగగా జరిగింది. ఈ సందర్భంగా గాయని,గాయకుల బృందం ఆలపించిన ఆధ్యాత్మిక గేయాలు, విద్యార్థుల నృత్యాలు అందరిని ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో మత గురువులు జోసెఫ్ రాజారావు, పాలేమేర జయరావు, రాయిరాల విజయ్‌కుమార్, మల్లవరపు ప్రకాష్, మైపన్‌పాల్, మాథ్యూ వర ప్రసాద్‌రాజు, తప్పెట శౌరి, పరసాల సుధాకర్, మేడికొండ స్లీవ్‌అప్ప, దామళ్ళ సురేష్, పసుపులేటి సురేష్, కనపర్తి ప్రకాష్, కొమ్ము ఆంటోనీ, జోజిరెడ్డి, మేడికొండ ఫ్రాన్సిస్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మత గురువులు పాల్గొన్నారు.

## ఏడోరోజు కొనసాగిన 'మీ కోసం.. మీ తహసీల్దార్'





**ప్రజాపక్షం/కరకగూడెం:** మీ కోసం మీ తహశీల్దార్ పేరుతో కరకగూడెం తహశీల్దార్ పి నాగ ప్రసాద్ చేపట్టిన వినూత్న కార్యక్రమం మంగళవారం ఏడవ రోజుకు చేరింది. తహశీల్దార్ మండలంలో ప్రతి గ్రామంలోనూ సుడిగాలి పర్యటన చేస్తూ ప్రతి గ్రామంలోనూ ఓటు హక్కు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతీ గ్రామాన్ని సందర్శించి ఓటు హక్కుపై అవగాహన కల్పించడమే కాకుండా ఓటు విలువ గురించి వివరించ న్నున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో రెవిన్యూశాఖ తరపున అందించే ప్రతీ సేవలను ప్రజలకు నెలకొన్న ప్రధాన సమస్యలను ప్రజల నుండి తెలుసుకోవాలన్నారు. వేసవికాలమైనందున మంచి నీటి కొరత ఏర్పడకుండా ప్రతీ ఇంటికి మంచినీరు అందించేలా చర్యలు చేపడతామన్నారు. ప్రజల నుండి సమస్యలను తెలుసుకునేందుకు మీ కోసం మీ తహశీల్దార్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6 గంటలకే కార్యక్రమం కార్యక్రమంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తనకు తెలపవచ్చని అన్నారు. ఇలాంటి అధికారి ఈ మండలానికి రావడం మండలానికి నేరుగా తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొంటున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క

### -భజన వారింటికి మంత్రి సీతక్క రాకతో సందడి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు భజన సతీష్, ప్రసాద్‌ల తమ్ముడు భజర సందీప్ వివాహ వేడుక ఇటీవల జరిగింది. ఈసందర్భంగా వారి స్వగృహానికి బుధవారం తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క ఆశీర్వదించారు. ఆమెతో పాటు కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ ఎంపి అభ్యర్థి పోరిక బలరాం నాయక్ హాజరయ్యారు. సీతక్క రాకతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అందరిని ఆప్యాయంగా పలకరించారు. ఎంపి అభ్యర్థిగా పోటీ చేసే బలరాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు బట్టా విజయ్‌గాంధీ, బోగాల శ్రీనివాస్‌రెడ్డి, బూర్గంపాడు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మందా నాగరాజు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పోతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఇరవెండి మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి , లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, మోరంపల్లిబంజర్ మాజీ ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, ఇండికా రమేష్, అబ్దుల్ ఘనీ, నాయకులు పసికంటి నాగమురళి, చిప్పరాజు, దాసరి సాంబ, బర్ల శేషు, సాంబయ్య, గోనెల చిన్న సడలు, లక్ష్మణ్, పుట్టి లక్ష్మీనారాయణ, దుద్దుకూరి రమేష్, దేగల ధర్మయ్య, గొల్ల కోటయ్య, గుండె వెంకన్న, పొట్టి ప్రసాద్, యువజన కాంగ్రెస్ నాయకులు రహీం, కేసుపాక రాజేష్, హరీష్ యాదవ్, శనగ కిషోర్, పెరుమల్ల రాంబాబు, అన్వేష్, గొల్లపూడి సత్యనారాయణ, రాంబాబు, దుర్గ, చిర్రా నాని, భద్ర, బాలా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కొలువులు సాధించిన వారికి సన్మానం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన తోట కృష్ణారావు, సూదా బ్రహ్మం గురకుల ఉద్యోగాలు సాధించిన విషయం తెలిసిందే. సిపిఎం పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పులి వెంకటనర్సయ్య ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగాలు సాధించిన వారిని సిపిఎం నాయకులు బొంతు రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వరరావు, కెవి, తుమ్మలపల్లి రమేష్, పొన్నం కృష్ణయ్య, గోపాలపేట మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావు, సొసైటీ డైరెక్టర్ గోవిందు శ్రీనివాసరావు శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత ఉద్యోగాలుసాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుగ్గినేని వెంకటేశ్వరరావు, అయినాల రామలింగేశ్వరరావు, సూదా హన్మంతరావు, మాజీ వార్డు మెంబర్ సూదా నర్సింహారావు, గోవిందు శ్రీనివాసరావు, ఆపతి రామయ్య, సురేష్, చింతల నరేష్, కందుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు ఆడుదాం.. స్నేహాలను పెంపొందించుకుందాం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి, గుండాల రెండు మండలాల స్థాయి బుధవారం రామానుజగూడెం, తునికిబండల యూత్ ఆధ్వర్యంలో తునికి బండల గ్రామంలో ఘనంగా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ క్రీడల వలన మానసిక ఉల్లాసం శరీర ధృఢత్వంతో పాటు స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌కి రెండు మంలాలల నుంచి 38 టీంలు వచ్చాయన్నారు. మొదటి బహుమతి రూ 10116 తాటి రామయ్య, తాటి సూరయ్య, తాటి నాగజ్యోతిలు స్పాన్సర్ చేస్తున్నారని, ద్వితీయ బహుమతి రూ 7116 గౌరిశెట్టి శ్రీనివాసరావు, భారతి ఫర్టిలైజర్స్ స్పాన్సర్ చేస్తున్నట్లుత తెలిపారు.అ దే విధంగా కోస్పాన్సర్‌గా అబ్బు నాగేశ్వరరావు, వీణ ఫర్టిలైజర్స్, బూరుగడ్డ రాములు శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, అనుమోల వెంకటేశ్వరరావు వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, సంక ప్రభాకర్ హనుమాన్ ఫెర్టిలైజర్స్ స్పాన్సర్ చేశారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మ కమిటీ సభ్యులు గొగ్గల లక్ష్మయ్య, యూత్ కృష్ణ, సాధిక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంట దగ్ధం



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో పర్సగాని రాధాకృష్ణ మొక్కజొన్న పంటకు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. పర్సగాని రాధాకృష్ణ మూడు ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంటను సాగు చేశాడు. గత రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలం చుట్టుపక్కల ప్రాంతాల్లో నిప్పు అంటించడం వల్ల మొక్కజొన్న పంటకు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. దీంతో రాధాకృష్ణకు రూ.2లక్షల మేరకు పంట నష్టం వాటిల్లింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేరువంచ పాఠశాలలో దొంగతనం





**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం దొంగతనం జరిగినట్లు ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ తెలిపారు. పాఠశాలకు ఉన్న తాళాలు పగలగొట్టి మధ్యాహ్న భోజన వంట పాత్రలు మధ్యాహ్న భోజన బియ్యం గదులలో వస్తు సామాగ్రి చిందర వందర చేసినట్లు ఆవరణలోకి కొందరు అగంతకులు వచ్చి పాఠశాలలో దొంగతనానికి పాల్పడినట్లు కల్లూరు ఎస్సై షేక్ షాకీర్ కు ఫిర్యాదు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ విషయమై పాఠశాలకు ఖమ్మం నుంచి క్లూస్ టీం వచ్చి పరిశీలించినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

# చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలి

## కలెక్టర్ విపి గౌతమ్





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చెరువుల్లో పేరుకుపోయిన చెత్తను పూడిక తీయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు రైతుల పొలాల్లో సారవంతమైన ఎరువుకు ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి వ్యవసాయ, ఈరిగేషన్ శాఖాధికారులతో చెరువుల పూడికతీత, రైతుల అవసరాలకు చెరువు మట్టి సరఫరా పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువులలో పేరుకు పోయిన పూడికను తొలగించడం ద్వారా చెరువు నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు పూడిక తీసిన మట్టిలో పంటలకు కావాల్సిన పౌష్టిక మైన దాతువులు, పంట దిగుబడికి దోహదపడుతుందన్నారు. ఇట్టి సమాచారం రైతులకు తెలియజేయాల్సిన అవసరం ఈరిగేషన్, వ్యవసాయ అధికారులపై ఉందన్నారు. అవసరమైన రైతులు తమ పరిధిలోని రైతు వేదికలలో ఉండే వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించి తమ అవసరాలకు అనుగుణంగా వివరాలను దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతులు ఈరిగేషన్ శాఖాధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదని వ్యవసాయ అధికారులు వివరాలను ఈరిగేషన్ శాఖాధికారులకు తెలిపి సారవంతమైన పూడిక తీసిన మట్టిని సమకూర్చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈరిగేషన్ ఎస్ఈ నర్సింహారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయనిర్మల, ఈరిగేషన్ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, ఈరిగేషన్ ఇంజనీర్లు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంత్రటాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టర్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్స్‌పై చర్యలు తీసుకోవాలని ఉగాది, రంజాన్ పండుగల నేపద్యంలో వేతనాలు అందక కొంతమంది కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను సింగరేణి అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల పని ప్రదేశాలను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెల కొంతమంది కాంట్రాక్టర్లు ఏదో కారణాలను చూపించి వేతనాలు సకాలంలో చెల్లించకుండా కాంట్రాక్ట్ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుంటే సివిల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ప్రతి చిన్న విషయానికి కాంట్రాక్ట్ కార్మికులపై చర్యలు తీసుకునే అధికారులు వారి వేతనాల సమస్యపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎండలు, వడగాల్పుల నేపద్యంలో కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలో మార్పులను చేయాలని వడదెబ్బకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని చేసిన విజ్ఞప్తి మేరకు కొత్తగూడెం కార్పొరేట్‌లో సోమవారం నుండి పనివేళలో మార్పులు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్నందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే అదరికి మజ్జిగ ప్యాకెట్లను సరఫరా చేయాలని, ప్రతిరోజు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పూర్తిస్థాయిలో అందించాలని, ఎండల నేపద్యంలో కాంట్రాక్ట్ కార్మికుల రక్షణను వదిలేసి తీవ్రమైన ఎండలో ఒత్తిడి చేసి పని చేపించాలనే ఆలోచన విరమించుకోవాలని కృష్ణయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు ఎం.చంద్రశేఖర్, కె.నర్సింహారావు, వినోద, శాంత, పద్మ, లక్ష్మి , రమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఖమ్మం ఎంపీగా పోటీ



**ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్:** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఖమ్మం ఎంపీగా పోటీ చేస్తానని రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు నైతిక విలువలకు త్రిలోదికాలు ఇచ్చాయన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పాలక, ప్రతిపక్ష పార్టీలువ్యవహరిస్తున్నాయన్నారు. జిల్లా అభివృద్ధి కొరకు, విద్య, వైద్య పరిశ్రమల స్థాపన కోసం ఖమ్మం లోక్ సభ ప్రజా ప్రతినిధిగా ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో పోటీ చేస్తానన్నారు. అన్ని పార్టీలు, పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్తలకు టికెట్లు కేటాయిస్తున్నాయన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పార్టీ టికెట్లు పొందిన ప్యారాచూట్ అభ్యర్థులు గెలుపు కోసం అదే స్థాయిలో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ఎన్నికల తర్వాత వారు వ్యాపారాలు అభివృద్ధి చేసుకుంటూ ప్రజా సమస్యలను విస్మరిస్తున్నా రన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలంటే కార్పొరేట్ వ్యాపార వస్తువు అయిందన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ, నైతిక విలువలను దిగజారుస్తూ రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని పుల్లారెడ్డి విమర్శించారు. జిల్లాలో రైల్వే లైన్ల కొరకు, పరిశ్రమల స్థాపన కోసం, వ్యవసాయ, నీటి పారుదల రంగాల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల కోసం ప్రజల తరపున ప్రజా గళం వినిపిస్తానన్నారు. ఉచితం సాకులతో ఓట్లు దండుకుంటూ ప్రజలను మోసం చేస్తూ పార్టీ ఫిరాయింపుదారులకు అగ్ర తాంబూలం ఇస్తున్నారన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు విడుదల చేయాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటైజర్ సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే విడుదల చేయాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఐయఫ్‌టియు) జిల్లా నాయకులు అమర్లపూడి శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కార్మికుల సమావేశంలో శరత్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్లో వెట్టిచాకిరి చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వటం లేదని, చాలీచాలని వేతనాలతో జీవనం గడుపుతున్నారని, కాంట్రాక్టులు మారుతున్న, ప్రభుత్వాలు మారుతున్నా కార్మికులకు వేతనాలు పెంచడంలో పూర్తిగా విప్లవం అయ్యాయని, పెంచిన వేతనాలను కూడా జీవో నెంబర్ 31ప్రకారం కార్మికులకు 12094 రూపాయలు, పియఫ్ లు 3000, ఈయస్ ఐ 446, మొత్తం 15600 రావాల్సిందని ఇది కాకుండా కాంట్రాక్టర్స్ ఇష్టం వచ్చినట్టుగా 10500 వేతనాలు ఇస్తున్నారని, పియఫ్ లు మరిచి పోయారన్నారు. సత్తుపల్లి ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు యూనిఫామ్ గాని, ఐడి కార్డులు గాని, షూస్ గాని, కార్మికులకు రావాల్సినవి ఏవి కూడా ఇంత వరకు ఇవ్వలేదని, వేతనాల కోసం ఎన్నిసార్లు జిల్లా మెడికల్ ఆఫీసర్లకు స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వారు అన్నారు. ఐదు నెలల నుంచి కార్మికులకు వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కరువైందని కార్మికులకు పండగలు వచ్చిన బయట అప్పు చేసి బ్రతకాల్సిన పరిస్థితి నెలకొన్నదని వారన్నారు. కొత్త కాంట్రాక్టర్ వచ్చి సంవత్సరం అవుతున్నా కార్మికులకు పియఫ్ నెంబర్లు ఇవ్వడం గానీ, పిఎఫ్ ఇవ్వటం గాని లేదని వారన్నారు. ఈ సమావేశంలో కుమారి, వెంకటరమణ, రాజేశ్వరి, ఖాశింబి, ప్రశాంత్, కళ్యాణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



**ప్రజాపక్షం/సుజాతనగర్:** పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ తోఫాను సుజాతనగర్ ఎంపీపీ భూక్య పద్మావతి అధ్యక్షతన అందజేశారు. పాల్వంచ పట్టణానికి చెందిన టిఎన్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిపిఐ మండల నాయకులు ఇంటింటికి తిరిగి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భూక్యాదస్రు, మండల సంయుక్త కార్యదర్శి కుమారి హనుమంతరావు, మండల సహాయ కార్యదర్శిలు పొదిల శ్రీనివాసరావు, వేల్పుల భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, మండల నాయకులు తాళ్ల వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు తాళ్లూరి పాపారావు, ధర్మారావు, ఏఐటియుసి మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్ , దుర్గాప్రసాద్, కుమారి కృష్ణ, శ్రీను, ముస్లిం పెద్దలు డాక్టర్ అలీమ్, బనిగిరి, అల్లా బక్ష్ సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి ముసుగు వేయాలనే మూర్ఖుల ఆలోచన విరమించుకోవాలి



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండల కేంద్రంలోని డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం దగ్గర బహుజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి, విద్యావేత్త సిద్దెల.రవి, డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ చైర్మన్ వేల్పుల భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాదిగ జే.ఏ.సి. రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మోదుగు జోగారావు పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ముసుగు వేయాలని మూర్ఖంగా ఆలోచిస్తూ , అధికారులపై ఒత్తిడి చేస్తున్న మూర్ఖులు, ఆ ఆలోచన విరమించు కోవాలని హెచ్చరించారు. దేశంలో ఎప్పుడు, ఎన్నడూ, ఎక్కడా అంబేద్కర్ విగ్రహానికి ముసుగు వేయలేదని గుర్తు చేశారు. కానీ కొంతమంది అసాంఘిక శక్తులు మూర్ఖంగా పిచ్చి ఆలోచన మార్చు కోవాలని లేకపోతే, జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆ ఆలోచన మార్చుకోకపోతే, అంబేద్కర్ వాదులు, మేధావులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, అన్ని బహుజన సంఘాలు, ఐక్య వేదికగా ఏర్పడి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. అనంతరం ఆ మహనీయుని విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తేలూరి ఉదయ్ ,వేల్పుల రాజు, ఈట వెంకట సాయి, సత్యం, పుల్లయ్య ,సాత్విక్ ,జగదీష్, సంతోష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఐలయ్య దంపతులకు సన్మానం



**ప్రజాపక్షం/కారేపల్లి:** శ్రీవెంకటేశ్వర టెంపుల్ చైర్మన్ సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, ఉమారాణి దంపతులకు శాలువా కప్పి సొసైటీ చైర్మన్ దారావత్ మంగీలాల్, కోఆప్షన్ సభ్యులు ఎండి.అనిఫ్ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బానోతు హీరాలాల్, వివిధ పార్టీల నాయకులు అజ్మీర వీరన్న, పిల్లి వెంకటేశ్వర్లు, అదెర్ల రామారావు, తోగర శ్రీను, జూపల్లి రాము, గుగులోతు చింటు, భూక్యా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపివో తీరు అధికారులు స్పందించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో ఉపాధిహామీ పథకంలో కనీస సౌకర్యాలు సమకూర్చడంలో ఎన్నిసార్లు కూడా ఏపివోకి మొరపెట్టుకున్న తనకు సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఉపాధిహామీ పథకం మండలంలోని మొత్తం మెట్ల కనుసన్నల్లో నడుస్తున్న ఎన్నిసార్లు కూడా పత్రికల్లో ప్రచురించిన పర్యవేక్షించకుండా పై అధికారి చెప్పిన కూడా తనకు సంబంధం లేకుండా వ్యవహరిస్తున్నారు. మండలంలో ఉపాధిహామీ పథకంలో హాజరు విషయంలో అవినీతి జరుగుతున్న కూడా పట్టించుకోని ఏపివో దీనిపై అధికారులు స్పందించి సమగ్రమైన విచారణ చేయాలని రైతు కూలి సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

# 15 నుంచి వార్షిక పరీక్షలు



**ప్రజాపక్షం/కల్లూరు:** ఈనెల 15 నుంచి వార్షిక పరీక్షలు 22 వరకు జరుగుతాయని మండల విద్యాశాఖ అధికారి దామోదర ప్రసాద్ తెలిపారు. కల్లూరు లోని మండల వనరుల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ 15వ తేదీ నుండి 22వ తేదీ వరకు ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు వార్షిక పరీక్షలు జరుగుతాయని, 23వ తేదీ ప్రోగ్రెస్ కార్డులు అందజేయడం జరుగుతుందని, 24 నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు వార్షిక పరీక్షల సమయ పాలనను టైం ట్ధం ను పాటించాలని కోరారు.

# ఎన్నికల కోడ్ కారణంగానే జాప్యం

**-ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర ప్రయత్నం**
**-టిజివో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల కోడ్ కారణంగానే ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కాస్త జాప్యం జరుగుతుందని కోడ్ ముగిసిన వెంటనే కార్యాచరణ మొదలవుతుందని టిజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం టిజీవో భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏలూరి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ ప్రయత్నం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలపై నిన్నటి దాకా నాయకులుగా చెలామణి అయిన వారు పట్టించుకోలేదని తమ స్వార్థ ప్రయోజనాల కోసం సంఘాలను వాడుకున్నారని ఆయన ఆరోపించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏమాత్రం కృషి చేయని వ్యక్తులు ఇప్పుడు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. బకాయి పడిన డిఏలు మొత్తం రూ.5,400 కోట్లు ఉద్యోగులకు అందాలని నాల్గవ డిఏ పిఆర్‌సిలో కలుస్తుంది కాబట్టి వీటన్నింటిని దశల వారీగా ఎన్నికల కోడ్ ముగిసన తర్వాత సాధించుకోవడం జరుగుతుందని ఏలూరి తెలిపారు. నగదుతో సంబంధం లేని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. 317 జీవో లో భాగంగా భార్యాభర్తలు వేర్వేరు చోట్ల పని చేస్తున్నారని గత ప్రభుత్వం 317 జీవోతో సంబంధం ఉన్న వారికి కనీసం కౌన్సిలింగ్ కూడా నిర్వహించ లేదన్నారు. దూర దూరంగా పోస్టింగులు ఇచ్చి వారిని తీవ్ర వేదనకు గురి చేశారని ఏలూరి ఆరోపించారు. ఈ విషయం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అనేక మార్లు వివరించడం జరిగిందని ఆయన తెలిపారు. ఏపి నుండి 10 ఏళ్ల తర్వాత నాల్గవ తరగతి ఉద్యోగులను తెలంగాణకు తీసుకు వచ్చిన ఘనత ప్రస్తుత టీజీవో నాయకత్వానికి చెందుతుందన్నారు. ఉద్యోగస్తులను అవమానించడం అనేది గత ప్రభుత్వ కాలంలో చూశామని ప్రస్తుతం టిజీవో ఆధ్వర్యంలో ఉద్యోగుల ఆత్మగౌరవం కాపాడడం కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్యశాఖకు చెందిన 142 జీవోను పునః సమీక్షించాలని మధ్యంతర భృతిని ఐదు శాతం నుండి 20 శాతానికి పెంచాలని ఎన్నికల కోడ్ ముగియగానే సాధారణ బదిలీలను కౌన్సిలింగ్ పద్ధతిలో నిర్వహించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కలెక్టర్లు మండల స్థాయి అధికారుల పట్ల అవమానకరంగా, అనుచితంగా ప్రవర్తిస్తున్నారని అటువంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. మీడియా సమావేశంలో టిజీవో మహిళా నాయకురాలు సుధారాణి, విజయలక్ష్మి, గణేష్, సతీష్, మోదుగు వెంకటేశ్వర్లు, వీరాస్వామి, కృష్ణారావు, టిఎన్‌జీవో నాయకులు కె. శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, గంగవరపు బాలకృష్ణ, తాళ్లూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కూలీల పొట్ట కొడుతున్న కేంద్ర ప్రభుత్వం



**ప్రజాపక్షం/కల్లూరుః** కూలీలు పొట్ట కొడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఓడించి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించాలని ఉపాధి కూలీలను స్థానిక ఎమ్మెల్యే మట్ట రాగమయి కూలీలను కోరారు. ఫిబ్రవరి నుంచి నేటి వరకు కూలీలకు రావాల్సిన మండలంలో రూ. 1.20 కోట్లు బకాయిలు పెండింగ్లో ఉన్నాయని రోజువారి వేతనం ఇవ్వకుండా కూలీలను కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీలు పథకాలు 90 రోజుల్లో అమలుపరిచిన ప్రభుత్వం కాంగ్రెస్ దేనిని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అదే విధంగా సిపిఐ డివిజన్ కార్యదర్శి దండు ఆదినారాయణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసివేసేందుకు కుట్ర పన్నుతుందని విమర్శించారు. కొర్లగూడెం, నారాయణపురం, పేరువంచ, ముగ్గ వెంకటాపురం గ్రామాలలో ఉపాధి హామీ కూలీలతో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# నిస్వార్థ నాయకుడు రజబ్ అలీ

**సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్**



**ప్రజాపక్షం/ఏన్కూరుః** పేద ప్రజల ఆశాజ్యోతి నిస్వార్థపరుడని సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్ అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఉద్యమనేత నిబద్దత కలిగిన నాయకుడు కామ్రేడ్ రజబ్‌అలి వర్ధంతి సందర్భంగా ఏన్కూరులో ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజబ్‌అలి పేద కుటుంబంలో పుట్టి పేదల కోసం నిరంతరం పోరాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఓటమి ఎరుగని జననేత మచ్చలేని నాయకుడిగా 5 సార్లు శాసనసభ సభ్యులుగా పేద ప్రజలు, రైతులు గిరిజనులు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి, ఆయన భౌతికంగా మన మధ్యన లేకపోయినా పేద ప్రజల, కష్టజీవుల హృదయాల్లో సుస్థిర స్థానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు అమరనేని వీరభద్రం, సీనియర్ నాయకులు మేడా భూషయ్య, మండల సహాయ కార్యదర్శి బానోతు రాంబాబు, ఏన్కూరు గ్రామ కార్యదర్శి మాదినేని వెంకన్న, కటా హరినాథ్, లక్ష్మ య్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్కే ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో అన్నదానం

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని ఆర్కే ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో సాయిబాలాజీ ఫైర్‌వర్క్స్ యజమాని దోసపాటి విజయ్ పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు, మతిస్థిమితం లేని వారికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ మాట్లాడుతూ ఆశ్రమానికి వెన్నుదన్నుగా ఉంటూ ఎన్నో సహాయ కార్యక్రమాల్లో తోడుగా ఉంటున్న దోసపాటి విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ అన్నదానం నిర్వహించటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జ్యోతి, ఆర్కే సుదర్శన్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



# రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణం చేసిన రేణుక



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు రేణుకా చౌదరి బుధవారం రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ రేణుకాచౌదరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. రేణుకా తెలంగాణ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విధితమే. తెలంగాణలో ఇటీవల మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ కాగా అందులో రెండు కాంగ్రెస్, ఒకటి బిఆర్ఎస్ ఏకగ్రీవంగా గెలుచుకున్నాయి. రెండింటిలో ఒక స్థానాన్ని కాంగ్రెస్ రేణుకాచౌదరికి కేటాయించింది. రేణుకా చౌదరి రాజ్యసభ సభ్యురాలిగా మూడోసారి బాధ్యతలు స్వీకరించారు. టిడిపి హయాంలో ఒకసారి, కాంగ్రెస్ హయాంలో మరోసారి రాజ్యసభ సభ్యురాలిగా పనిచేసిన రేణుకా తిరిగి కాంగ్రెస్ నుంచి మూడోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. రేణుకాచౌదరి ప్రమాణ స్వీకారోత్సవానికి ఖమ్మం జిల్లా నుంచి పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. ఇదిలా ఖమ్మంజిల్లాకు చెందిన బిఆర్ఎస్ నేత వద్దిరాజు రవిచంద్ర కూడా రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విధితమే.

# మండే ఎండలలో బయటకు రావద్దు

**ప్రజాపక్షం/కల్లూరుః** మండుతున్న ఎండలకు ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రావద్దని తహాశీల్దార్ పులి సాంబశివుడు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతకు బయటకు తిరుగుతున్న ప్రజలు చనిపోతున్నారని నేడు జిల్లాలో మూడు మరణాలు సంభవించినట్లు సాంబశివుడు తెలిపారు. కావున ప్రయాణం చేసేవారు వృద్ధులు, పిల్లలు, బాటసారులు, తగ్గించుకోవాలని అత్యవసరమైతేనే బయటకు రావాలని ఒక వేళ అత్యవసరం అయితే వారి వెంట మంచినీరు, నిమ్మరసం, మంచినీరు, ఓ ఆర్ ఎస్‌లు వెంట తీసుకొని వెళ్లాలని తెల్ల టోపీ, చేతి రుమాలు, గొడుగు వెంట ఉంచుకోవాలని తహాశీల్దార్ పేర్కొన్నారు. కావున ప్రజలు వేసవి తాపాన్ని తట్టుకునేందుకు పలు జాగ్రత్తలు, సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించి ప్రాణాన్ని రక్షించుకోవాలని ప్రజలను కోరారు.

# ది ముంబయి ఆంధ్ర మహాసభలో అలరించిన తల్లాడ మండల కళాకారులు



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఆంధ్ర మహాసభ కల్చరర్ అధ్యక్షులు డాక్టర్ రాధామోహన్, సెక్రటరీ తాళ్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ది ముంబయి ఆంధ్ర మహాసభలో ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెలంగాణ జానపద కళాకారులు ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రెడ్డిగూడెంకు చెందిన బాలు కాంపల్లి బృందం జానపద నృత్యాలు , జబర్దస్త్ వినోదిని కామెడి , అమర్లపూడి శ్వేతవర్షిణి కూచిపూడి నృత్య కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి జగన్నాధం, అంధ్రమహా సభ అధ్యక్షులు సుంకు సుధాకర్, వేముల మనోహర్, పెద్దపాక అకిల్, అలవాల డప్పు నాగేశ్వరరావు, కీ బోర్డు రోజు, పల్లవి పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/ తల్లాడ :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల నాయకులు కలిశారు. బుధవారం గండుగల పల్లిలోని మంత్రి స్వగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పలు సమస్యలను విన్నవించారు. సహకార సంఘాల్లో రైతులు తీసుకున్న రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్త రుణాలను ఇప్పించేందుకు చొరవ చూపాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. వర్షాలు సకాలంలో లేకపోవడంతో రైతులు కొంత నష్టాల్లో ఉన్నారని, కొత్త రుణాలు వచ్చే మార్గం చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి తుమ్మల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో వైరా మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దుండేటి వీరారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పగడాల లచ్చిరెడ్డి, ఎంపిటిసి కొమ్మినేని ప్రభాకర్ రావు, మాజీ సర్పంచ్ పోట్రు శరత్, మాజీ జెడ్పిటిసి మూకర్ ప్రసాద్, సామినేని రాము, అప్పారావు మర్శకట్ల బాబురావు, తవిడిశెట్టి యుగంధర్, జగన్మోహన్‌రావు, వంకాయలపాటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రాయింగ్ ఒలంపియాడ్‌లో టాలెంట్ స్కూల్ విద్యార్థుల విజయకేతనం



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** ఇండియన్ బ్రిలియంట్స్ ఒలంపియాడ్ వారి ఆధ్వర్యంలో స్థానిక సత్తుపల్లి టాలెంట్ స్కూల్లో నిర్వహించిన క్రియేటివ్ పెయింటింగ్ ఒలంపియాడ్ లో సుమారు 32 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్, శిల్డ్స్ మరియు మేరీట్ ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు కరెస్పాండెంట్ పులి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు 100 మంది విద్యార్థులకు పైగా ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని యాజమాన్యం మరియు ఉపాధ్యాయుని బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# చరితార్ధుడు సిఆర్

## వర్ధంతి సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తుదిశ్వాస వరకు పేదల అభ్యున్నతి కోసం, కమ్యూనిస్టు పార్టీ విస్తరణ కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ధన్యుడని చరిత్ర ఉన్నంత కాలం సిఆర్ పేరు చరిత్రలో నిలిచిపోతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. సుదీర్ఘ కాలం సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సిఆర్ కమ్యూనిస్టు పార్టీలో చేరి పేదల పక్షాన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని ఆయన తెలిపారు. భారతదేశ వ్యాప్తంగా భూ పోరాటాలను నిర్వహించిన ఘనత సిఆర్‌కే దక్కుతుందన్నారు. నిస్వార్థ పరునిగా దేశ చరిత్రలో ఆయన పేరు నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామ కృష్ణ, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు గాదె లక్ష్మి నారాయణ, పగిడి పల్లి ఏసు, ఇటికాల రామకృష్ణ, బోడా వీరన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మల్లి కార్జున్, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# దేదీప్యమానంగా భద్రాద్రి రామాలయం



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీరామ నవమి కళ్యాణోత్సవంలో భాగంగా భద్రాచలంలో తిరు కళ్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఈనెల 17న సీతారాముల కళ్యాణం జరగనుండగా, 18న శ్రీరామ పట్టాభిషేకం జరిపిస్తారు. ఇందులో భాగంగా ఆలయ పరిసరాలతో పాటు పట్టణం సర్వాగం సుంధరంగ ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా భద్రాద్రి రామాలయం విద్యుత్ దీపాల కాంతులతో దేదీప్య మానంగా వెలిగిపోతోంది. గాలిగోపురంతో పాటు చుట్టు ప్రకారాలకు రంగురంగుల విద్యు దీపాలు వెలిగించారు. ఇందులో సీతారాముల ఉత్సవమూర్తుల రూపంలో విద్యుత్ దీపాలను అలంకరించారు. ఆలయం ఎదురుగా గోదావరి అవతలి ఒడ్డు నుండి చూసినా కూడా రామాలయం ధగధగా మెరిసిపోతంది. దీంతో భద్రాచలంలో రాముల వారి పెళ్లి సందడి మొదలైంది.

# నోడల్ అధికారులు విధులు సమర్థవంతంగా చేపట్టాలి

## కలెక్టర్ విపి గౌతమ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా చేపట్టాలని రాబోయే ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారి విపి గౌతమ్ సమీక్ష నిర్వహించారు. నామినేషన్ సహాయక కేంద్రాల ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్, ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల మేరకు అన్ని ముందస్తు చర్యల్లో వేగం పెంచాలన్నారు. ఈనెల 18 నుండి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని నామినేషన్లకు సంబంధించి సామాగ్రి, ఎలక్షన్ కమిషన్ నుండి నామినేషన్ ప్రింటెడ్ పత్రాలు, ఇట్టి బ్లాంక్ నామినేషన్ పత్రాలు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసి పోటీ చేసే అభ్యర్థి , ప్రపోజర్ల ఓటు హక్కు ఉన్నది లేనిది చూడటం, పోస్టల్ బ్యాలెట్, ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, అబ్సెంటి ఓటర్లు, 85 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, ఎస్సెన్సియల్ సర్వీసులో పని చేసే వారికి ఫారం 12, 12 ఎ తీసుకోవాలన్నారు. ఎన్‌ఐసి పోర్టల్ నుండి ఎవరు ఎక్కడ పనిచేయుచున్నది నివేదిక తీసుకుని దాని ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. గత ఎన్నికల్లో హోం ఓటింగ్ సౌకర్యం కల్పించిన వారికి తిరిగి కల్పించాలన్నారు. మే మూడు నుండి హోం ఓటింగ్ చేపట్టనున్నట్లు దీనికి అన్ని చర్యలు చేపట్టాలన్నారు. సెగ్మెంట్లలో ఇవిఎంలను భద్రపర్చుటకు స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేయాలని, పోస్టల్ బ్యాలెట్లను భద్రపర్చడానికి మండల స్థాయిలో భద్రతతో కూడిన స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. సువిధ అనుమతులు నిర్ణీత కాల వ్యవధిలోగా జారీ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, శిక్షణ కలెక్టర్ యువరాజ్, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, అదనపు డిసిపి ప్రసాదరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల నాయకుడు రజబ్ అలీ



**ప్రజాపక్షం/వైరా:** పేదల పెన్నిధి నిస్వార్థపరుడు కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నేత నిబద్ధత కలిగిన నాయకుడు ప్రజల మనిషి కామ్రేడ్ రజబ్‌అలి వర్ధంతి సందర్భంగా రజబ్‌అలికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు మాట్లాడుతూ రజబ్‌అలి పేద కుటుంబాల్లో పుట్టిపేదల కోసం నిరంతరం పోరాడి ప్రాణాలు వీడిని వ్యక్తి అని కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లాలో ఎదగడానికి ఎంతో కృషి చేసి నిరంతరం పాటుబడిన వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, ఏఐటియుసి మండల కార్యదర్శి గారపాటి అశోక్, రైతు సంఘం నాయకులు కొండా రామకృష్ణ, దొబ్బల కృష్ణయ్య, చింతపల్లి గోపాలరావు, రాయి రవి, శ్రీనివాసరావు, అప్పం సుధాకర్, గాంది, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులకు సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఘనంగా సన్మానించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పదవి విరమణ పొందిన హోంగార్డులు సిహెచ్ తిరుమలరాజు, ఎన్. నాగయ్యలను సిపి సునీల్ దత్ శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో బాధ్యతాయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. రిటైర్‌మెంట్ తన వృత్తికే కాని తన వ్యక్తిత్వానికి కాదని మీ విధి నిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా సిపి అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసిపి సుశీల్ సింగ్, హోంగార్డు ఆర్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ దత్తురామ్, హోంగార్డు ఆఫీసర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మహ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు బంక శ్రీను, వెంకన్న, రవిబాబు, గురుమూర్తి, గౌస్, పవన్, హోంగార్డు ఆఫీసర్స్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తండ్రి సంతాప సభల నిర్వహణకు మాజీ నక్సలైట్ గణేష్ అన్న భిక్షాటన



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** తండ్రి కోరం జగ్గయ్య దశదిన కర్మలు సంతాప సభలు నిర్వహణకు మాజీ నక్సలైట్ గణేష్ అన్న మండల కేంద్రంలో భిక్షాటన చేపట్టిన సందర్భంలో మండల కేంద్రానికి చెందిన బిజెపి నాయకులు సిరినోముల వజ్రేశ్వరరావు దశ దిన కర్మల నిమిత్తం పాతిక కేజీల వీఎస్టీక్కిన వితరణగా అందజేశారు. ఈసందర్భంగా గణేష్ అన్న మాట్లాడుతూ తన తండ్రి కోరం జగ్గయ్య పీడిత ప్రజల విముక్తి కోసం 40ఏళ్ల పాటు ఉద్యమం చేశారని దున్నేవాడికి భూమి అనే నినాదంతో ఇచ్చారని పోడు భూములు కొట్టిచ్చారని ఇలా అనేక ఉద్యమాలు చేస్తున్న సమయంలో నేను మా నాన్న జగ్గయ్య బాటలోనే ఉద్యమ దారి పట్టవలసి వచ్చిందని, ఆ సమయంలో సొంత భూములను కోల్పోయి నిర్వాసితులమయ్యాయని లొంగిపోయిన తరువాత ప్రభుత్వం నుంచి ఇటు పార్టీ నుంచి కానీ ఎటువంటి జీవన భృతి కలగలేదని, నేడు పేదల కోసం పోరాటాలు చేసిన తన తండ్రి దశదినకర్మ గాని సంతాప సభకు గానీ డబ్బులు లేక అవసరం లేక బిక్షాటన చేయవలసి వచ్చిందన్నారు. ఈ బిక్షాటన ద్వారానైనా తండ్రి సంతాప సభలు నిర్వహించాలని మండల కేంద్రంలో ఈ విధంగా బిక్షాటన కార్యక్రమం చేపట్టానని అన్నారు.

# వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినికి లాప్‌టాప్ అందజేత




**ప్రజాపక్షం/వైరా:** వైరా గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు వుంద్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో బిటెక్ చదువుతున్న వైరాకు చెందిన ఫనితి నేహశ్రీ అనే విద్యార్థినికి లాప్టాప్ అందించారు. ఈ కార్యక్రమంలో లయన్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ వైరాగ్రేట్ విజన్ క్లబ్, లయన్స్ విద్యాట్రస్ట్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు లాప్టాప్‌లు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంటి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్ బాబు, ఆర్‌సి లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, వుయ్యూరు రామకృష్ణ, జాలా మహాలక్ష్మి పాల్గొన్నారు.

# విద్యార్థికి అభినందనలు



**ప్రజాపక్షం/వైరా:** ఇటీవల జరిగిన నవోదయ ఫలితాల్లో వైరాకి చెందిన కుదురుపాక పవన్‌తేజ్ విద్యార్థి ప్రతిభ చూపి సీటు సంపాదించింది. మండలంలోని సీటు సాధించిన ఏకైక విద్యార్థిగా నిలిచిన కుదురుపాక పవన్‌తేజ్‌కు కెఎంఆర్ హాస్పిటల్ డాక్టర్ కుదురుపాక మోహన్‌రావు పవన్‌తేజ్‌ను అభినందించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైరా పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గజ్జల వెంకన్న, ప్రధాన కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, పవన్‌తేజ్, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులు మాచర్ల రాంబాబు, పట్టణ నాయీబ్రాహ్మణ నాయకులు కుదురుపాక శ్రీహరి, గజ్జల రామకృష్ణ, శ్రీకాకుళం శ్రీరంగం, నంద్యాల శ్రీనివాసరావు, గజ్జల నర్సింహారావు, మంచికంటి శంకర్, శ్రీకాకుళం శ్రీను, ఎల్లంకి సతీష్, గుండె మీద గోపి, రాచమల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన జెడ్‌పిటిసి శ్రీలత




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను మండలంలోని ముస్లింలందరూ ఆనందంగా జరుపుకొని అల్లా దీవెనలను అందుకోవాలని జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత ఆకాంక్షించారు. నెల రోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగను ముస్లింలు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని సేవలకు మించి మానవ సేవ అత్యున్నతమైనదని చాటి చెప్పే రంజాన్ పండుగ లౌకిక వాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్ ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ప్రజలంతా కలిసి మెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా ఆశీర్వాదాలుండాలని అన్నారు.